అదిగో పునుగు పిల్లి.!

ప్రజాశక్తి-కార్వేటినగరం: శేషాచలం అడవుల్లో అరుదుగా కనిపించే పునుగుపిల్లి కార్వేటినగరం - పచ్చికాపల్లం మార్గంలోని చిన్నకనుమ వద్ద ప్రత్యక్షమైంది. అటుగా వెళుతూ గుర్తించిన సాఫ్టువేర్ ఇంజనీర్ లోకేష్ వెంటనే అటవీశాఖ అధికారులకు, రెవిన్యూ సిబ్బందికి సమాచారం అందించినా.. వారు అందుబాటులోకి రాక పోవడంతో లోకేష్ తన స్నేహితులతో కలసి పునుగుపిల్లిని అటవీశాఖ కార్యాలయానికి అప్పగించారు. దీంతో అధికారులు దట్టమైన అటవీ ప్రాంతంలో వదిలి రక్షిస్తామని హామీ ఇచ్చారు. అరుదుగా కనిపించే ఈ పిల్లి స్థానిక యువకులకు కనిపించడం, ఆ పిల్లిని సురక్షితంగా అధికారులకు అప్పగించడాన్ని పలువురు అభినందించారు.

- పెండింగ్‌లో బిల్లులు.. ఇబ్బందుల్లో కూలీలు
- ఉపాధి కూలీలకు అందని సొమ్ము
- 10వారాలుగా ఇబ్బందులు పడుతున్న కష్ట జీవులు
- బిల్లులు వెంటనే మంజూరు చేయాలని వేడుకోలు

వేతన వెతలు

ఉన్న చోటే పని కల్పిస్తామంటే.. కష్టం చేసుకొని కడుపునింపుకుందామని వెళ్లిన ఉపాధి కూలీలు సర్కార్ వేతనాలు చెల్లించకపోవడంతో కడుపు మాడ్చుకుంటున్నారు. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పది వారాలుగా సొమ్ము ఖాతాల్లో జమకాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా పెద్దసార్లు కనికరం చూపి కష్టం సొమ్ము చేతికివ్వకపోతారా అని కళ్ళు కాయలుకాసేలా ఎదురు చూస్తున్నారు..

- ప్రజాశక్తి-పూతలపట్టు

అధికారులు స్పందించాలి..

గత పది వారాలుగా ఉపాధి పనులు చేస్తున్నప్పటికీ వేతనం పడలేదు. మాతోపాటు కుటుంబ సభ్యులు పనిచేస్తున్నారు. వారికి వేతనం అందలేదు. అధికారులు స్పందించి మాకు వేతనాలు వెంటనే పడే విధంగా తగిన చర్యలు తీసుకోవాలి.

- రామాంజనేయులు, ఉపాధి హామీ కూలి

ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు ప్రతివారం కూలీ డబ్బులు చెల్లించాలి. ఒకవేళ ఆలస్యమైన గరిష్టంగా 15 రోజుల్లో ఇవ్వాలి. ఆ తరువాత చెల్లిస్తే వడ్డీతో సహా జమ చేయాలని చట్టం చెబుతోంది. కానీ పనులు చేసి నెలలు గడిచిన వేతనాలు అందకపోవడంతో కూలీలు తల్లడిల్లుతున్న పట్టించుకునే వారే లేరు. మండల కేంద్రాల్లోని ఉపాధి హామీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. సొంత గ్రామాల్లో పనులు కల్పిస్తామని అధికారులు చెప్పిన మాటలు నమ్మి పనులకు వెళితే సకాలంలో కూలి చెల్లించడంలో విఫలమయ్యారని కూలీలు ఆవేదన చెందుతున్నారు. జిల్లాలోని మండల కేంద్రాల వద్ద నిరసన తెలిపేందుకు సిద్ధపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేతనాలు అందించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఒక్క మండలంలోనే.. రూ.81.32 లక్షల బకాయిలు..

పూతలపట్టు మండలంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న 4,833మంది కూలీలకు రూ.81.32లక్షల బకాయిలు రావాల్సి ఉంది. గత మే నెల 21నుంచి బకాయిలు ఆగిపోవడంతో ఉపాధి కూలీలు లబోదిబోమంటున్నారు. గ్రూపులు గ్రూపులుగా ఉపాధి హామీ కార్యాలయాలు చుట్టూ నిత్యం ప్రదక్షిణలు చేస్తున్నారు. వేతనాలు ఆగిపోవడంతో కూలీలు పనులకు కూడా రాము అంటూ అడ్డం తిరుగుతున్నారు. దీంతో మండలంలో చాలావరకు ఉపాధి పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం కేవలం సొంత పనులకు సంబంధించిన ఉపాధి పనులు మాత్రమే జరుగుతున్నాయి.

వేతనాలు వెంటనే ఇవ్వాలి..

పది వారాలుగా వేతనం అందకపోవడంతో ఉపాధి కూలీలు ఎంతో ఇబ్బంది. అధికారులు వెంటనే స్పందించాలి. వేతనాలు బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలి. పని ప్రదేశంలో వారి ఇబ్బందుల గుర్తించి పరిష్కరించాలి. అవసరమైన పనిముట్లను సరఫరా చేయాలి.

- వాడ గంగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి

త్వరలో అందిస్తాం..

కూలీలకు బకాయిలు ఉన్నమాట వాస్తవమే. త్వరలో కూలీల ఖాతాల్లో వేతనాలు జమ చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఆందోళన పడాల్సిన అవసరం లేదు. జిల్లా పాలనధికారితో శుక్రవారం సమావేశం ఉన్నందున ఒకటి, రెండు రోజుల్లో బిల్లులు పడే అవకాశం ఉంది.

- సౌభాగ్యవతి, ఏపీవో, పూతలపట్టు

కుప్పం యువతి అరుదైన ఘనత

ప్రజాశక్తి-కుప్పం: మిస్ యూనివర్స్-ఇండియాకు ఏపీ నుంచి అర్హత సాధించిన చందన జయరాం అనే యువతి సీఎం నారా చంద్రబాబు నాయుడుని శుక్రవారం అమరావతి సచివాలయంలో కలిశారు. కుప్పం నియోజకవర్గం, శాంతిపురం మండలం, ఎం.కె.పురంనకు చెందిన చందనా జయరాం ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో మిస్ యూనివర్స్ ఇండియాకు రాష్ట్రం నుంచి ఎంపికయ్యారు. ముంబైలో జరిగే మిస్ యూనివర్స్ ఇండియా పోటీల్లో ఏపీ నుంచి చందన పాల్గొననున్నారు. కుప్పం నుంచి చందన జయరాం మిస్ యూనివర్స్-ఇండియా పోటీలకు అర్హత సాధించడంపై సీఎం సంతోషం వ్యక్తం చేశారు.

- మిస్ యూనివర్స్-ఇండియాకు అర్హత
- అభినందించిన సీఎం చంద్రబాబు

మన చేతిలో.. ఆరోగ్యం

- చిత్తూరు మున్సిపల్ వర్కర్ల మెడికల్ క్యాంపు ఏర్పాటు
- ప్రారంభించిన కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: మన ఆరోగ్య రక్షణ మనందరి చేతుల్లోనే ఉందని, అవగాహనతో తగు జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో పబ్లిక్ హెల్త్ వర్కర్లు, మున్సిపాలిటీ ఇంజనీరింగ్ వర్కర్లు, ఇతర సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన ఉచిత హెల్త్ చెకప్ మెడికల్ క్యాంపు, అవగాహన కార్యక్రమానికి కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, కమిషనర్ డాక్టర్ జె.అరుణ, నగర మేయర్ ఆముద హాజరైన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ, రోగ లక్షణాలు, నివారణ చర్యలు ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి, ఆరోగ్యం పట్ల అప్రమత్తత అవసరమని ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి అని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలి

- జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఖరీఫ్‌కు నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ అధికారి మురళీ కృష్ణతో కలసి ఖరీఫ్ సాగుపై ఏడీలు, ఏవోలతో సమీక్ష నిర్వహించారు. జెసి మాట్లాడుతూ జిల్లాలో గత సంవత్సరం ఖరీఫ్‌లో నిర్దేశం లక్ష్యం కంటే ఈ సంవత్సరంలో ఎక్కువ సాగు చేయడానికి అనుగుణంగా అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు పూర్తి అవగాహన కలిగించాలన్నారు. ఈ ఖరీఫ్ సీజన్లో వేరుశెనగ, వరి, రాగులు, కందులు, ఉలవలు పంటలు వేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతులకు వ్యవసాయానికి రుణాలు ఇవ్వడానికి నిర్లక్ష్యం చేస్తున్న బ్యాంక్ అధికారులతో మాట్లాడి రైతులకు సకాలంలో రుణాలు మంజూరు చేయించాలన్నారు. పలమనేరు, బంగారుపాళ్యం మండలాల్లో వేరుశెనగ పంటలకు అడవి పందులు, ఏనుగుల వల్ల నష్టం జరుగుతుందని అందు వల్ల రైతులు ముందుకు రావడం లేదని ఏడిలు తెలపగా సోలార్ పినిసింగ్ ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ ఏడిలు, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పు అనాలోచితం

- మోడీ, జగన్ పాలనలో దళితులకు తీవ్ర అన్యాయం
- మూతబడ్డ ఎస్సీ కార్పొరేషన్‌లను తెరిపించాలి
- మాజి ఎంపి చింతామోహన్
- చిత్తూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మాజీ ఎంపీ చింతామోహన్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఆర్థికంగా సామాజికంగా వెనుకబడిన వర్గాలకు కోసం రాజ్యాంగంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పొందుపరిన రిజర్వేషన్‌లకు వ్యతిరేకంగా సుప్రీమ్ కోర్టు ఇచ్చిన తీర్పును దేశంలోని దళితులతో పాటు అన్ని వర్గాలు వ్యతిరేకిస్తున్నట్లు కాంగ్రెస్ మాజీ ఎంపి చింతామోహన్ అన్నారు. ఆ తీర్పు పూర్తిగా అనాలోచితమని వ్యాఖ్యానించారు. దళితులకు జరుగుతున్న అన్యాయాలను నిరశిస్తూ శుక్రవారం స్థానిక జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చింతామోహన్ మాట్లాడుతూ కేంద్రలో మోడి, రాష్ట్రంలో జగన్ పాలనతో దళితులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. రిజ ర్వేషన్ల విషయంలో సుప్రీమ్ కోర్టు తీర్పును కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ఎస్సీ కార్పొరేషన్‌కు నిధుల్వికుండా నిర్వీయం చేసిన ఘనత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు దళితులకు అన్యాయం చేస్తున్నారని కొత్తగా టిటిడిలో నియమితులైన అధికార్లలో ఒక్క దళితుడు లేరని, చంద్రబాబు పాలనలో ఒక్క ఎస్సీ ఐఎఎస్ లేకపోవడం చూస్తే దళితుల పట్ల చంద్రబాబుకు ఉన్న ప్రేమ ఏపాటిదో అర్థం చేసుకోవచ్చునన్నారు. 20శాతం ఉన్న దళితులు హక్కుల కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు.

కార్పెంటర్లను ఆదుకుంటాం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: కార్పెంటర్లను అన్ని విధాలా ఆదుకుంటామని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. శుక్రవారం స్థానిక బెంగుళూరు బైపాస్ రోడ్డులో నిర్వహించిన సమావేశంలో కార్పెంటర్లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కార్పెంటర్లకు రెండున్న ఎకరం స్థలం కేటాయిందని నగరంలోని కార్పెంటర్లు షాపుల కోసం కేటాయించిన స్థలం సరిపోవడం లేని ఈ విషయంపై కలెక్టర్‌తో చర్చించి సమీపంలో కొంత స్థలం ఇప్పించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. అలాగే విద్యుత్ సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు. సమావేశంలో టిడిపి నాయకులు దొరబాబు, కార్పొరేటర్ అలి, కోలా కిరణ్‌లతో పాటు కార్పెంటర్స్ యూనియన్ నాయకులు సత్య, కుమరేషన్, రాజేష్‌లతో పలువురు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి

- వాహనదారులకు సీటు బెల్టు, శిరస్త్రాణం తప్పనిసరి..
- అవగాహన కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ నిత్యబాబు

సమావేశంలో మాట్లాడుతున్న ట్రాఫిక్ సిఐ నిత్యాబాబు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ట్రాఫిక్ నియమ నిబంధనలు తప్పక పాటించాలని చిత్తూరు ట్రాఫిక్ సీఐ సత్యబాబు అన్నారు. శుక్రవారం చిత్తూరులోని కొంగారెడ్డిపల్లి సర్ సి.ఆర్.ఆర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సమాజంలో పోలీసు వ్యవస్థ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీఐ నిత్యబాబు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటిస్తూ రోడ్డుపై తగు జాగ్రత్తలు వహించాలన్నారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణించే ప్రతిఒక్కరూ శిరస్త్రాణం ధరించాలని కారులో ప్రయాణించే ప్రతిఒక్కరూ సీటు బెల్టు ధరించాలని సూచించారు. వాడకపోతే వచ్చే అనర్థాలను చక్కగా వివరించారు. అనంతరం ట్రాఫిక్ సిగ్నల్స్ గురించి వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ మమతా నాథ్ మాట్లాడుతూ కార్యక్రమంలో వివరించిన వాటిని తల్లిదండ్రులకు కూడా తెలిపి వారితో కలిసి ఇవన్నీ ఆచరించాలని తెలిపారు. స్కూల్ డైరక్టర్ అమర్‌నాథ్ మాట్లాడుతూ సమాజంలోని ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించినట్లయితే ప్రమాదాలు లేని సమాజం చూడవచ్చన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మీపతి, సిబ్బంది పాల్గొన్నారు.

తహశీల్దార్లకు పోస్టింగ్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: సాధారణ ఎన్నికల సందర్భంగా ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్ళిన తహశీల్దార్‌లను ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ చిత్తూరు జిల్లాకు తిరిగి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా నుంచి బదిలీపై వెళ్ళిన తహశీల్దార్‌లను ప్రభుత్వం తిరిగి చిత్తూరు జిల్లాకు కేటాయించగా, ఆ తహశీల్దార్లకు మండలాలను కేటాయిస్తూ కలెక్టర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తహశీల్దార్లు కేటాయించిన మండలాల వివరాలు.. చిత్తూరు కలెక్టరేట్, మెజిస్టీరియల్ సెక్షన్ తహశీల్దార్/సూపరింటెండెంట్‌కు టి.సీతారాం కె.బ్యూలా, కె.పద్మజ, పి.మురళి, జి.ఎం.కుమారస్వామి, ఆర్.వాసుదేవన్ - చిత్తూరు కలెక్టరేట్, ల్యాండ్ రిఫామ్స్, స్పెషల్ తహశీల్దార్, కృష్ణ కుమార్ డిఏఓ, ఆర్‌డిఓ ఆఫీసు, చిత్తూరు, టి.జి.మోహనవల్లి - ఆర్‌డిఓ ఆఫీసు, పలమనేరు, పి.శివరామన్ - ఆర్‌డిఓ ఆఫీసు, నగరి, జి.జయప్రకాష్ - ఆర్‌డిఓ ఆఫీసు, కుప్పం, ఏ.కళావతి - తహశీల్దార్, చిత్తూరు అర్బన్, కె.బెన్ను రాజ్ - సోమల, బి.హనుమంతు - చౌడేపల్లి, జి.చంద్రశేఖర్ రెడ్డి - గుడిపాల, బి.కుల శేఖర్ - సదుం, డి.రవి కుమార్ - నగరి, ఈ.శేషగిరి రావు - నింద్ర, ఎం.భగవతి - కార్వేటినగరం, వి.చంద్రశేఖర్-జి.డి.నెల్లూరు, ఇ.అమరనాథ్ - ఎస్.ఆర్.పురం, ఎం.అరుణ కుమారి - పాలసముద్రం, ఎన్.ఎం.గుర్రప్ప - పూతలపట్టు, కె.బాబు రాజేంద్ర ప్రసాద్ - బంగారుపాళెం, ఆర్.ఇన్బ నాథన్ -పలమనేరు, బి.పార్వతి - వి.కోట, ఎస్.మాధవరాజు - విజయపురం, వై.చిట్టిబాబు - కుప్పం, కె.అమరనాథ్ - శాంతిపురం, కె.బాబు - రామకుప్పం, బి.రామాంజుల నాయక్ - గుడుపల్లి, డి.లక్ష్మీనారాయణ, తహశీల్దార్‌ను తిరుపతి జిల్లాకు కేటాయించారు. జిల్లాలోని డిప్యూటీ తహశీల్దార్‌లను తహశీల్దార్లుగా పూర్తి అదనపు భాధ్యత ఇస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ తహశీల్దార్లకు తహశీల్దార్లుగా పూర్తి అదనపు బాధ్యత కేటాయించిన మండలాలు వివరాలు.. ఎం.ఎస్. ప్రసన్న కుమార్‌ను పెద్ద పంజాణికి, ఎన్.సుధాకర్‌ను తవణంపల్లెకి, బి.కళ్యాణిను పెనుమూరుకి, ఎస్.కిరణ్‌ను విజయపురంకి, కె.మహేష్ కుమార్‌ను ఐరాలకి, జి.ఎల్.శివ కుమార్‌ను గంగవరంకి, ఆర్.జయంత్‌ను యాదమరికి పూర్తి అదనపు భాధ్యతలు అప్పగించారు.

బయట వ్యక్తులతో అంగన్వాడీ సెంటర్ నిర్వహణ

- ఆర్టీఐకి తప్పుడు సమాచారం ఇచ్చిన అధికారి
- చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కి సిఐటియు లేఖ

ప్రజాశక్తి-కుప్పం టౌన్: ఒకుప్పం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని కనమనపల్లి అంగన్వాడి సెంటర్‌లో ఆ శాఖకు సంబంధం లేని మహిళ చేత పనిచేయడం దారుణం అని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు గౌరవ అధ్యక్షులు వాడ గంగరాజు ఆరోపించారు. ఆయన మాట్లాడుతూ కనమనపల్లి అంగన్వాడి సెంటర్‌లో బయట వ్యక్తులను పనులకు వినియోగించుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయమై తమకు పూర్తి సమాచారం అందించాలని కోరుతూ సమాచార హక్కు చట్టం క్రింద స్థానిక ప్రాజెక్టు అధికారికి వినతి పత్రాన్ని సమర్పించడం జరిగిందన్నారు. ఈ విషయమై స్పందించిన ప్రాజెక్టు అధికారి తమ పరిధిలో తప్పు జరిగినట్టు తన దృష్టికి వచ్చిన, వాటిని కప్పి పెడుతూ, అలాంటి తప్పు జరగలేదంటూ సమాచార హక్కు చట్టం క్రింద అర్జీ చేసుకున్న వారికి తప్పుడు సమాచారాన్ని అందించడం జరిగిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కుప్పం ప్రాజెక్టు అధికారి తప్పు చేసిన వారిని ప్రోత్సహిస్తూ చిన్నారుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నారని ఆరోపించారు. ఈ ప్రాజెక్టు పరిధిలో జరుగుతున్న అక్రమాలలో ఇది మచ్చుకు మాత్రమేనని, స్థానిక ప్రాజెక్టు అధికారి ప్రవర్తన వల్ల అంగన్వాడీ వర్కర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దుయ్యబట్టారు. నూతన ప్రభుత్వం అంగన్వాడీల ఖాళీలను భర్తీ చేయడానికి సిద్ధం అయితే ఈ ప్రాజెక్టులో దరఖాస్తు చేసిన వారి వివరాలను ప్రాజెక్టు అధికారి జిల్లా అధికారులకు చేర్చలేదని ఆరోపించారు. ఈ విషయాలన్నింటినీ లేఖ ద్వారా చిత్తూరు కలెక్టర్ సుమిత్ కుమార్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ స్పందన కోసం వేచి చూస్తున్నామన్నారు.

తహశీల్దార్లా..మజాకా..!

- కోరుకున్నచోటికి లక్షల్లో నజరానా
- రూ.కోటి పలికిన తిరుపతి రూరల్
- ఉమ్మడి జిల్లాలో బదిలీల జాతర

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



ప్రభుత్వం మారింది.. విధానాలు మారలేదు.. ప్రజాప్రతినిధుల చేతులు తడుపుకోవడం మానలేదు.. బాగా ఆదాయం ఉన్న 'రెవెన్యూ' శాఖలో తహశీల్దార్లు డబ్బులిచ్చి మరీ పోస్టింగ్‌లు వేయించుకున్నట్లు సమాచారం. ఒక్క చిత్తూరు జిల్లాలో 32 మంది తహశీల్దార్లకు పోస్టింగ్‌లు ఇస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే గతంలో వీళ్లు ఎన్నికలకు ముందు ఇదే జిల్లాలో పనిచేస్తూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు డిప్యుటేషన్‌పై అనంతపురం, కడప, అన్నమయ్య, కర్నూలు జిల్లాలకు బదిలీపై వెళ్లారు. నూతన ప్రభుత్వం అధికారం చేపట్టింది. కలెక్టర్లు నుంచి ఆర్డీవోలు, తహశీల్దార్లు వరకూ సాధారణ బదిలీలు జరుగుతూ ఉన్నాయి. అందులో భాగంగానే చిత్తూరు జిల్లాలో 32 మంది తహశీల్దార్లుకు పోస్టింగ్ ఇచ్చారు. రేపోమాపో తిరుపతి తహశీల్దార్లు 32 మందికి ఆర్డర్లు రానున్నాయి.

శుక్రవారం బదిలీ అయిన 32 మందిలో దాదాపు ఏడుగురికి అధికార పార్టీ ఎంఎల్‌ఎలు అడిగినంత నజరానా చెల్లించకపోవడంతో మారుమూల మండలాలకు బదిలీ చేశారని చర్చ నడుస్తోంది. పాలసముద్రం, నింద్ర, విజయపురం తదితర మండలాల్లో డబ్బులిచ్చుకోలేని వారు బదిలీపై వెళ్లారు.కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాలు మినహా మిగిలిన అన్ని మండలాల్లోనూ ఆయా స్థానిక ప్రజాప్రతినిధులు బదిలీలను 'క్యాష్' చేసుకున్నారని చర్చ నడుస్తోంది. రెవెన్యూ ఆదాయం బాగా ఉండే మండలాల్లో 20-30 లక్షల ధర పోస్టింగ్‌కు పలికింది. రెవెన్యూ తక్కువగా ఉండి, భూముల విలువ తక్కువగా ఉండేచోట 10-15 లక్షలు ఇవ్వాల్సి వచ్చింది. తిరుపతి జిల్లా రాష్ట్రంలోనే ఖరీదైన జిల్లా. తిరుపతి రూరల్, అర్బన్, చంద్రగిరి, రేణిగుంట, రామచంద్రాపురం, సత్యవేడు, పుత్తూరు, వడమాలపేట, వెంకటగిరి, సూళ్లూరుపేట, నాయుడుపేట, కోట, వాకాడు, గూడూరు, ఏర్పేడు, శ్రీకాళహస్తి రూరల్, తొట్టంబేడు, వరదయ్యపాళెం, పిచ్చాటూరు మండలాల్లో తహశీల్దార్లు చీటీపాట పాడినట్లుగా పాడుకున్నారు. ఒక్క తిరుపతి రూరల్ ప్రాంతమే కోటి ధర పలికినట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. సంబంధిత నియోజకవర్గ ప్రజాప్రతినిధి ఎంత డిమాండ్ చేస్తే అంత ఇచ్చుకున్నట్లు సమాచారం. చంద్రగిరి, రేణిగుంట, రామచంద్రాపురం, ఏర్పేడు, శ్రీకాళహస్తి మండలాలు రూ.30 లక్షలు సమర్పించుకున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే పోస్టింగ్స్ ఇస్తారని చర్చ నడిపిన వారం రోజుల్లోనే ఈ డీల్ కుదిరినట్లు తెలుస్తోంది. సత్యవేడు నియోజకవర్గంలోని ఏడు మండలాలకు తక్కువ 'ధర' పలికినట్లు సమాచారం.

నేడు క్రీడల శాఖ మంత్రి జిల్లాకు రాక

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: రాష్ట్ర రవాణా యువజన, క్రీడలు శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఈనెల 3వ తేదీ శనివారం ఒకరోజు పర్యటనలో భాగంగా ఉ.11 గంటలకు చిత్తూరుకు చేరుకుంటారని కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిత్తూరు ఎమ్మెల్యే ఏర్పాటు చేసిన స్థానిక కార్యక్రమాలలో పాల్గొంటారని, అనంతరం మ.12 గంటలకు చిత్తూరు బస్ డిపో నుంచి నూతన బస్సులకు ఫ్లాగ్ ఆఫ్ చేస్తారని, మ.1గంటల నుండి మ.2గంటల వరకు రిజర్వులో ఉండి మ.3గంటలకు చిత్తూరు నుంచి బయలుదేరి రోడ్డు మార్గాన రాయచోటికి వెళ్తారని ఆ ప్రకటనలో తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

- సిబ్బందికి తహశీల్దార్ సూచన

ప్రజాశక్తి-పూతలపట్టు: అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని నూతన తహశీల్దార్ ఎంఎన్ గురప్ప సూచించారు. శుక్రవారం పూతలపట్టు తహశీల్దార్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరరం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. దీర్ఘకాలిక భూ సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అందరి సమన్వయంతో పనిచేయాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

'కందిపప్పు రానందు వల్లే సరఫరా చేయలేకపోయాం'

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: కందిపప్పు గోడౌన్ నుంచి సరఫరా కానందు వల్ల జూన్ నెలలో సరఫరా చేయలేకపోయినట్లు బంగారుపాళ్యం సిడిపిఓ వాణిశ్రీదేవి తెలిపారు. అంగన్వాడీల అవస్థలు అంటూ మెనూ పాటించేందుకు అంగన్వాడీలు పడుతున్న ఇబ్బందులపై శుక్రవారం ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన వార్తపై సిడిపిఓ స్పందించారు. అంగన్వాడీ సెంటర్లకు సరఫరా చేస్తున్న వస్తువులు ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రభుత్వ బడ్జెట్‌ను అనుసరించి సరఫరా చేస్తున్నట్లు వివరణ ఇచ్చారు.

పింఛన్ కోసం పడిగాపులు

- సచివాలయం చుట్టూ తిరిగిన వృద్ధురాలు
- డిజిటల్ అసిస్టెంట్ తీరుపై పలువురు అసహనం

ప్రజాశక్తి-విజయపురం: సకాలంలో పింఛన్ అందక ఓ వృద్ధ మహిళ సచివాలయం చుట్టూ తిరిగింది. నగదు అందజేసేందుకు డిజిటల్ అసిస్టెంట్ సకాలంలో అందుబాటులో లేకపోవడంతో కార్యాలయం ఎదుట నిరీక్షించింది. వివరాలు.. మండలంలోని శ్రీహరిపురం సచివాలయ పరిధిలో వృద్ధ మహిళ సరోజమ్మ నెలనెలా పింఛన్ తీసుకుంటోంది. ఎప్పటిలానే ఈ నెల 1న పింఛన్ కోసం స్థానికుల సాయంతో ఫోన్ ద్వారా డిజిటల్ అసిస్టెంట్‌ని సంప్రదించింది. 2న సచివాలయం వద్దకు వచ్చి పింఛన్ తీసుకోవాలని ఫోన్‌లో తేల్చి చెప్పిన డిజిటల్ అసిస్టెంట్ శుక్రవారం కార్యాలయం వద్ద అందుబాటులో లేరు. శుక్రవారం ఉదయం ప్రత్యేకంగా ఆటో బాడుగకు తీసుకొచ్చిన సరోజమ్మ డిజిటల్ అసిస్టెంట్ కోసం గంటల తరబడి నిరీక్షించింది. సచివాలయానికి వచ్చిన పలువురు స్థానికులు వృద్ధ మహిళను పలకరించారు. తాను పింఛన్ కోసం వచ్చానని గురువారం కాదంటే.. నేరుగా అక్కడికి వచ్చినట్లు బదులిచ్చింది. లబ్ధిదారుల ఇండ్లకే వెళ్లి పింఛన్ ఇవ్వాలని సీఎం, కలెక్టర్‌ల ఉత్తర్వులు ఉన్నప్పటికీ నిర్లక్ష్యంగా వృద్ధులను ఇబ్బంది పెడుతున్న డిజిటల్ అసిస్టెంట్‌పై అక్కడి వారు అసహనం వ్యక్తం చేశారు. ఆలస్యంగా వచ్చిన పింఛన్ అందజేశారు. కార్యాలయానికి విచ్చేస్తున్న ప్రజలకు కూడా ఇదే తరహాలో నిర్లక్ష్యంగా సమాధానం చెబుతూ సకాలంలో స్పందించడం లేదని అక్కడి గ్రామస్తులు ఒకింత ఆరోపణలు చేశారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

హార్టికల్చర్ ప్లాంటేషన్ పనులు ప్రారంభించండి

- ఉపాది పని దినాలను పెంచండి
- అధికారులతో కలెక్టర్ సుమిత్ కుమార్ సమీక్ష

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఉపాధి హామీ పథకం కింద హార్టికల్చర్ ప్లాంటేషన్‌లో ఫిట్టింగ్, మొక్కలు నాటే పనులను ప్రారంభించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఉపాధి హామీ పథకం అమలు తీరు క్లస్టర్ల వారీగా పని దినాలు చేపడుతున్న పనులు, తదితర అంశాలపై డ్వామా పిడి ఎన్.రాజ శేఖర్‌తో కలసి ఏపిడిలు, ఏపివోలతో సమగ్రంగా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి పథకంలో కూలీల మొబిలైజేషన్, 100రోజుల పని దినాల కల్పనపై ఏపిడిలు, ఏపివోల ప్రత్యేక శ్రద్ధపెట్టి పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస యోజన పథకం కింద ఇంటి నిర్మాణ పనులకు కూడా ఉపాది కూలీలను వినియోగించుకునేందుకు అవకాశం ఉందన్నారు. తద్వారా జాబ్ కార్డ్ కలిగిన వారికి ఉపాదిని కల్పించేందుకు కృషి చేయాలన్నారు. దీనితో పాటు హార్టికల్చర్ ప్లానిటేషన్‌కి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. మెటీరియల్ కాంపొనెంటును పెంచే విషయంపై ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలన్నారు. జిల్లాలో చేపడుతున్న ఫారం ఫాండ్స్ ,ఫీడర్ ఛానల్ పనులు, అమృత్ సరోవర్ పనులు, రోడ్డు ఫార్మేషన్, సప్లై ఛానల్ హార్టికల్చర్, ట్రెంచ్ వర్క్స్, బౌండరీస్, తదితర పనులకు సంబంధించిన అంశాలపై క్లస్టర్ల వారీగా సమీక్షించారు.

పారిశుద్ధ్య పనులు వేగవంతం చేయండి

- జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి

ప్రజాశక్తి-వికోట: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను వేగవంతం చేసి రోగాలు ప్రబలకుండా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండల పరిధిలోని నెర్నిపల్లి పంచాయతీలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలకు శుభ్రమైన తాగునీరు అందించాలన్నారు. అదేవిధంగా అన్ని ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను వేగవంతం చేసి మురుగు నీటి కాలువలలో తీసిన చెత్తను ఊరు బయటకు ట్రాక్టర్ల ద్వారా తరలించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో రోగాలు ప్రబలకుండా స్థానిక సర్పంచులు ఇతర ప్రజాప్రతినిధుల సహకారంతో ఆరోగ్య సిబ్బందిని సమన్వయం చేసుకొని రోగాలు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వీరి వెంట కార్యదర్శి నరేష్ స్థానికులు పాల్గొన్నారు.

వీఆర్‌వోకు విఆర్‌ఏగా రివర్షన్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి ప్రభుత్వ భూములను ఆక్రమించినందుకు చౌడేపల్లి మండలం గడ్డంవా రిపల్లి విఆర్‌వో వై.వెంకటమునికి విఆర్‌ఏగా రివర్షన్ ఇస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి పుంగనూరు మండల పరిధిలో ప్రభుత్వ అసైన్ భూమిని తన అధికార దుర్వినియోగం చేసి తన స్వంత కుటుంబ సభ్యుల పేరున పట్టా మంజూరు చేయించారన్న ఫిర్యాదుతో మదనపల్లె సబ్ కలెక్టర్‌ను విచారణ అధికారిగా నియమించి విచారించడం జరిగిందని, ఈ విచారణలో చౌడేపల్లి మండలం గడ్డంవారిపల్లి విఆర్ఓ వై.వెంకటముని తన అధికార దుర్వినియోగం చేసినట్లు రుజువు కావడంతో విఆర్‌ఏగా రివర్షన్ ఇచ్చారు.

విద్యాభివృద్ధికి పెద్దపీట

ప్రజాశక్తి-రామకుప్పం: టిడిపి ప్రభుత్వంలో విద్యాభి వృద్ధికి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో అన్ని విధాల సహాయ, సహకారాలు అందిస్తు న్నారని టీడీపి మండల అధ్యక్షులు ఆనంద రెడ్డి, కార్యదర్శి నరసింహులు, మాజీ అధ్యక్షుడు ఆంజనేయ రెడ్డిలు అన్నారు. శుక్రవారం మండల శివార్లలోని జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు దశా, దిశా మెరుగుపడాలంటే టిడిపితోనే సాధ్యమవుతుందన్నారు. నూతన భవనాలు, మరుగుదొడ్లు, త్రాగునీరు, ఉచిత పుస్తకాలు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు చదువు పట్ల మక్కువ చూపి మంచి ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీతాపతి, మునిరెడ్డి, రామలింగారెడ్డి, విశ్వనాథ్, సుబ్రి, మురళి, సురేష్, ప్రిన్సిపాల్ చాణిక్యుడు, నీరజ, పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-వెదురుకుప్పం: ఐరాల మండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన సీనియర్ సాఫ్ట్ బాల్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలలో వెదురుకుప్పం విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని హెచ్ఎం శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తరుణ్, ఉమ, హిందూ ఎంపికైనట్లు వివరించారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 10, 11, 12తేదీల్లో పల్నాడు జిల్లా వినుకొండలో జరగనున్న రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో జిల్లా తరపున ప్రతినిత్యం వహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ వ్యాయామ ఉపాధ్యాయులను, విద్యార్థులను అభినందించారు.

పెరిపల్లం దేవాలయాన్ని సందర్శించిన అధికారులు

ప్రజాశక్తి-కుప్పం రూరల్: కుప్పం మండలం చెక్కునత్తం పంచాయితీ కూసురు గ్రామ పరిధిలోని పెరిపల్లం శ్రీ బాలసుబ్రమణ్య స్వామి దేవాలయాన్ని శుక్రవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్, స్థాపతి పి.పరమేశ్వరప్ప, ప్రసన్నలక్ష్మి, డిఈ శ్రీనివాసులు ఇతర అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, పూజారులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అధికారులకు మంగళహారతులతో పాటు తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం అధికారులు దేవాలయ పరిసర ప్రాంతాలను పరిశీలించి ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపుతామన్నారు. ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆలయ అభివృద్ధికి సహకరించడం ఎంతగానో ఆనందంగా ఉందన్నారు. సీఎం ఆదేశాలతోనే అధికారులు ఆలయాన్ని సందర్శించినట్టు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ కమిటీ కన్వీనర్, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ మాజీ అధ్యక్షులు సత్యేంద్రశేఖర్, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మణి, స్థానిక నాయకులు సంతోష్, మురళి, సుబ్బు, కనకరాజు, సుందర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లిస్తాం..

- జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు

రైతులతో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: బెంగుళూరు- చైన్నై జాతీయ రహదారికి భూములు ఇచ్చిన రైతులకు న్యాయ పరమైన నష్ట పరిహారం చెల్లిస్తామని జేసీ పి.శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం బైరెడ్డిపల్లి మండల తహశీల్దార్ కార్యాలయంలో పలమనేరు ఆర్డీఓ మనోజ్ రెడ్డితో కలసి బెంగుళూరు-చైన్నై జాతీయ రహదారికి భూములు ఇచ్చిన రైతులకు నష్ట పరిహారం చెల్లించడంపై రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రోడ్డుకు భూములు ఇచ్చిన రైతులు సరైన పత్రాలు, ఆర్బీటేషన్ సోమవారం జిల్లా కలెక్టరేట్‌కు రావాలని సంబందితా విఆర్‌ఓను ఆదేశించారు. రోడ్డుకు భూములు ఇచ్చిన రైతులకు ఇప్పటికే నష్ట పరిహారం చెల్లించడం జరిగిందని, మిగిలిన 22మందికి చెల్లించవలసి ఉందని వీరికి సంబందించిన పత్రాలను పరిశీలించి చెల్లించడం జరుగుతుందన్నారు. రైతులు ప్రభుత్వానికి సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ కిశోర్, యన్‌హెచ్ తరపున కార్తీక్, కలెక్టరేట్ యల్‌ఏ సెక్షన్ సిబ్బంది, విఆర్‌ఓ గురువిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకెళితే సాధ్యం కానిది లేదు

- ప్రతి ఛాత్రోపాధ్యాయుడు ఉపాధ్యాయుడిగా వెళ్ళాలి
- ప్రభుత్వ డైట్లో విద్యనభ్యశించడం ఓ వరం
- డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్

ప్రజాశక్తి-కార్వేటినగరం: విద్యార్థి దశ నుంచి ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లితే సాధ్యం కాని ఏది లేదని తిరుపతి డీఈవో, జిల్లా విద్యాశిక్షణా సంస్థ(డైట్) ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శేఖర్ అన్నారు. శుక్రవారం డైట్లో నిర్వహించిన ప్రెషర్స్ డే సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు కార్వేటినగరం డైట్కు ఓ ప్రత్యేకత ఉందని, ఇక్కడ విద్యాభ్యాసాలు చేసిన ఛాత్రోపాధ్యాయులు ప్రతి ఒక్కరూ అధ్యాపకులుగా ఉద్యోగాలు సాధించారని గుర్తు చేశారు. అలాంటి అహల్లాదకరమైన వాతావరణం కలిగి, అన్ని విధాల అనుభవం కలిగిన అధ్యాపకులను డైట్లో విద్యనభ్యసించడం అదృష్టంగా భావించాలన్నారు. రానున్న డీఎస్సీని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఉపాధ్యాయులుగా ఇంటికి వెళ్లాలని సూచించారు. అలాగే అధ్యాపకులు అందించే సలహాలు, సూచనలు తప్పక పాటించి తమ లక్ష్యాన్ని చేదించేంత వరకు విశ్రమించ కూడదని పేర్కొన్నారు. అనంతరం పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ ఒలపిక్ క్రీడలో విజయం కోసం క్రీడాకారులకు ఉన్న దృడ సంకల్పం ఛాత్రోపాధ్యాయులకు ఉండాలని వారిని ఆదర్శంగా తీసుకుని పోటీ తత్వంతో పరీక్షలకు తరపు అవ్వాలను పిలుపునిచ్చారు. ఛాత్రోపాధ్యాయులు చేపట్టిన నృత్యాలు పలువురిని ఎంతో ఆకట్టుకుంది. వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి మెమోంటోలను అందించారు. కార్యక్రమంలో ఇన్చార్జి ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం, అధ్యాపకులు నిర్మల, దేవప్రసాద్, రఫీరెడ్డి, వెంకటరమణ, సునీత, అనిత, నాగరాజనాయక్, శ్రీనివాసులురెడ్డి, పలువురు పాల్గొన్నారు.

ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలి: జేసీ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు చేపడుతున్నదని జేసీ పి.శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు, ఎస్.సి, ఎస్.టి, బి.సి, మైనారిటీ వసతి గృహాల అధికారులు, చౌక దుకాణాల డీలర్లు, వసతి గృహాల వార్డెన్‌లు, ఎండియు ఆపరేటర్లను రేషన్ కార్డుదారులు, ఇతర సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం అమలవుతున్న ప్రజా పంపిణీ వ్యవస్థలో చేపట్టవలసిన మార్పులు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, తదితర అంశాలపై కూలంకుశంగా చర్చించారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూలి ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ కార్డుదారులకు మరింత నాణ్యమైన నిత్యావసర వస్తువులతో పాటు పకడ్బందీగా ఈ వ్యవస్థను నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం 15రోజుల వరకు ఎండియూ ఆపరేటర్లు వారి పరిధిలో రేషన్ పంపిణీ చేయడం జరుగుతున్నదన్నారు. కార్డుదారుల బయోమెట్రిక్ పని చేయని పక్షంలో రేషన్ పంపిణీ నిమిత్తం ఐరిష్ సహాయంతో లేదా విఆర్‌ఓ ఆమోదంతో కానీ రేషన్ పంపిణీ చేయడం జరుగుతున్నదని తెలిపారు. సమావేశంలో డిఎస్‌ఓ శంకరన్, డిఎం సివిల్ సప్లైస్ మోహన్, సోషల్ వెల్ఫేర్ డిడి రాజ్యలక్ష్మి, చిత్తూరు డివైఈఓ చంద్రశేఖర్, ఎఫ్‌పి షాప్ డీలర్‌లు, ఎండియు ఆపరేటర్‌లు, వసతి గృహాల వార్డెన్‌లు, కార్డుదారులు పాల్గొన్నారు.

కనక నాచమ్మ ఆలయానికి ప్రత్యేక బస్సు సర్వీసు

ప్రజాశక్తి-కుప్పం టౌన్: కుప్పం మండలం నాయనురు పంచాయతీ పెద్దవంక గ్రామంలో వెలిసిన కనక నాచమ్మ దేవాలయానికి ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆడి 18 పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారి దర్శనార్థం భక్తులు పెద్ద సంఖ్యలో దేవస్థానం వద్దకు చేరుకుంటారు. వారి ప్రయాణ సౌలభ్యం కోసం శనివారం ఒక్కరోజు కుప్పం నుంచి పెద్దవంక గ్రామానికి ప్రత్యేక బస్సు సర్వీసును ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా వారు సూచించారు.

నాగాలమ్మ సేవలో సీకే బాబు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: నగరంలోని సంతపేట నాగాలమ్మ 21వ వార్షికోత్సవ మహోత్సవంలో చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

మద్యం ధ్వంసం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: రూ.55లక్షల 55వేల విలువైన అక్రమ మద్యం ధ్వంసం చేసినట్టు స్పెషల్ ఎంఫోర్స్మెంట్ ఏవో శ్రీధర్ బాబు తెలి పారు. శుక్రవారం మండల కేంద్రంలోని మా మిడి మండీలలో 2020-24 ఏడాదిలో స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యంను జెసిబితో ధ్వంసం చేశారు.

గంగ జాతరలో ఎమ్మెల్యే మురళీమోహన్

ప్రజాశక్తి-చిత్తూరు డెస్క్: మండలంలోని రామకృష్ణాపురం, బీసీవై గ్రామాల్లో నిర్వహించిన గంగమ్మ జాతరకు పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ హాజరయ్యారు. శుక్రవారం గంగమ్మ ఆలయం వద్దకు చేరుకున్న ఎమ్మెల్యేకి మండల, స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు వేద ఆశీర్వాదం అందజేసి పట్టు వస్త్రంతో సత్కరించి అమ్మవారి తీర్థప్రసాదాలను అందించారు.

ఆధునిక వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-రామకుప్పం: మండలంలోని చల్దిగానిపల్లి గ్రామంలో ఆధునిక వ్యవసాయంపై తిరుపతి శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పంటల సాగు విధానం, ఇజ్రాయిల్ టెక్నాలజీతో తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి పంటలు సాధించవచ్చు అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తులు, కూరగాయలు, పండ్ల తోటలకు అనేక విధాలుగా ప్రోత్సహిస్తుందన్నారు. ఇక్కడ సాగు చేస్తున్న పంటలను పరిశీలించి స్థానిక రైతులతో పంటల సాగుపై లోటుపాట్లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ ప్రొఫెసర్ మురళీకృష్ణ, విద్యార్థులు, స్థానిక రైతుల పాల్గొన్నారు.

అనుమతిలేని పాఠశాలలను రద్దుచేయాలి

సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - పిచ్చాటూరు: అనుమతి లేని పాఠశాలలను రద్దు చేయాలని కోరుతూ ఎంఈవో కార్యాలయం వద్ద, సీడీపీవో కార్యాలయం ఎదుట సిఐటియు అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి జనార్ధన్, సిఐటియు అంగన్‌వాడీ యూనియన్ పిచ్చాటూరు ప్రాజెక్టు కార్యదర్శి ఇంద్రాణి మాట్లాడుతూ పిచ్చాటూరు మండలంలో ఎలాంటి అనుమతులు లేకపోయినా సిఎస్ఐ వారు పాఠశాలలు నిర్వహిస్తున్నారని, ఈ పాఠశాలలకు విద్యార్థుల తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి ప్రలోభాలకు గురిచేసి తీసుకెళుతున్నారని విమర్శించారు. అంగన్‌వాడీ స్కూళ్లలోని చిన్న పిల్లలను వారి పాఠశాలలకు తీసుకెళ్లడం దారుణమన్నారు. ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు లేకపోయినా ఆ సంస్థ వారు విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నారని, భవిష్యత్తులో ఏదైనా జరిగితే తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం తక్షణమే జోక్యం చేసుకొని అనుమతులు లేని పాఠశాలలను రద్దుచేసి, ప్రభుత్వ విద్యాసంస్థలైన అంగన్వాడీలను, ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థుల భవిష్యత్తుకు దారి చూపాలని కోరారు. అనంతరం ఎంఈఓ కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ అనుమతులు లేని పాఠశాలలకు నిర్వహించకూడదని వారికి తెలిపామని, ఇదే విషయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారికి నివేదిక పంపుతామని తెలిపారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం సిడిపిఓకి, ఎంపీడీవోకి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అంగన్‌వాడీ యూనియన్ పిచ్చాటూరు ప్రాజెక్టు కార్యదర్శి ఇంద్రాణి, నాయకులు కృష్ణవేణి, శ్రీవాణి, ప్రమీల, భారతి, కళ్యాణి, అముదా, రూత్ మేరి, ప్రభావతి, శాంతి, చంద్రకళ, పాల్గొన్నారు.

ఇంటి వద్దనే చెత్త సేకరణ

ప్రజాశక్తి-కుప్పం టౌన్: కుప్పం పురపాలక సంఘం పరిధిలో ప్రతి ఇంటి వద్ద చెత్త సేకరణ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన 10, 11, 3, 24 వార్డుల ప్రాంతాలలో ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురపాలక సంఘం పారిశుద్ధ్య కార్మికులు పట్టణ పరిధిలో ప్రతి ఇంటి వద్దకు వచ్చి చెత్త వాహనం ద్వారా చెత్తను సేకరించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకుని, ప్రతి ఇంటిలో విధిగా చెత్తబుట్టను ఏర్పాటు చేసి, చెత్తను పారిశుద్ధ్య కార్మికుల ద్వారా చెత్త బండికి అందించాలని సూచించారు. రోడ్లపై కానీ, ఖాళీ స్థలాలలో గాని చెత్తను పారవేయ కూడదని తెలియజేస్తూ, ముఖ్యంగా నివాస స్థలాలలో, ఇండ్ల పరిసరాలలో నీటి నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకుని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మెప్మా పిఓ జగదీష్, సిఓ శోభ పాల్గొన్నారు.

బంగారుపాళ్యం తహశీల్దార్‌గా బాబు రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: నూతన తహశీల్దార్‌గా బాబు రాజేంద్రప్రసాద్ శనివారం బాధ్యతలు చేపట్టనున్నట్లు డిప్యూటీ తహశీల్దార్ అనిల్ కుమార్ తెలిపారు. శుక్రవారం జరిగిన బదిలీలలో మండల తహశీల్దార్‌గా బాబు రాజేంద్రప్రసాద్‌ని బదిలీ చేశారన్నారు. ఈయన గతంలో గుడిపాల తహశీల్దార్‌గా ఉండి ఎన్నికల విధుల్లో నంద్యాల వెళ్లి తిరిగి కలెక్టరేట్కు రావడంపై బదిలీలను కొనసాగించినట్ట ఆయన తెలిపారు.

జీడీ నెల్లూరు తహశీల్దార్‌గా చంద్రశేఖర్

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండల తహశీల్దార్‌గా వి.చంద్రశేఖర్‌ను నియమిస్తూ కలెక్టర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం గంగాధర నెల్లూరు తహశీల్దార్‌గా చంద్రశేఖర్ పూర్తి బాధ్యతలను చేపట్టారు. డిప్యూటీ తహశీల్దార్ తులసీరామ్, మండలసర్వేర్ గణేష్ కార్యాలయానికి ఆయనకు స్వాగతం పలికారు.

వాహనాల వేలం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడ్డ వాహనాలను శుక్రవారం ఎస్ఈబీ ఏవో శ్రీధర్ బాబు నేతృత్వంలో బహిరంగ వేలం నిర్వహించారు. ఆదాయం రూ.82 600వచ్చినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో సిఐ లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండలంలోని వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలు బైరెడ్డిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో డిఎస్పి విష్ణు రఘువీర్ ఆధ్వర్యంలో ఎస్ఈబీ ఏవో శ్రీధర్ రావు, సిఐ కృష్ణమోహన్ కలసి శుక్రవారం ఆరు ద్విచక్ర వాహనాలు రెండు ఫోర్ వీలర్లు వేల నిర్ణయించగా 28మంది వేలంలో పాల్గొన్నారు. అందులో రూ.259700 ప్రభుత్వానికి ఆదాయం వచ్చినట్లు ఏఎస్ఐ అన్నపూర్ణ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-విజయపురం: ఒంటరితనం భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కలియంబాకం ఆది ఆంధ్ర వాడలో చోటుచేసుకుంది. కలియం పాకం ఆదిఆంధ్ర వాడికి చెందిన నాగభూ షణం (49) 20 ఏళ్ల క్రితం వివాహమైంది. సుమారు 15ఏళ్ల క్రితం భార్య తన పిల్లలు దూరంగా ఉంటు న్నారు దీంతో మనస్పార్థం చెందిన నాగభూషణం ఒంటరితనం భరించలేక ఉరి వేసుకున్నారు. తమ్ముడు శేఖర్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ జయప్ప కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'తల్లిపాల విశిష్టత తెలుసుకోవాలి'

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: శ్రీశిశు సంక్షేమ శాఖ నేతృత్వంలో నిర్వహిస్తున్న తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం యాదమరి మండలం మాదిరెడ్డిపల్లి సెక్టార్ తురకపల్లి అంగన్వాడీ కేంద్రంలో గర్భవతులు, బాలింతలకు తల్లిపాల విశిష్టతను తెలియజేసేలా అంగన్వాడీ కార్యకర్త షకీలా, ఏఎన్ఎం విమల వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. పుట్టిన బిడ్డకు ఆరు నెలలపాటు ముర్రుపాలను తాగించడం వల్ల అనేక వ్యాధుల నుండి రక్షణ కవచంలా ఉంటుందని తెలిపారు.

చిత్తూరు డెస్క్: చిన్నారులకు తల్లిపాలే శ్రేయస్కరమని హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ అన్నారు. తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం యాదమరి అంగన్వాడి కేంద్రంలో బాలింతలకు గర్భవతులకు తల్లిపాలు యొక్క విశిష్టతను గూర్చి ఆయన వివరించారు.

సోమల: మండలంలోని సూరయ్యగారిపల్లి, నంజంపేట, సోమల అంగన్వాడీ కేంద్రాలలో ప్రతి మొదటి శుక్రవారం అంగన్వాడీ కేంద్ర పరిధిలోని తల్లులకు గర్భవతులకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని శుక్రవారం పంపిణీ చేశారు.

పెద్దపంజాణి: మండలంలోని కొగిలేరు, కమ్మినాయనిపల్లి పంచాయతీల్లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్మినాయనిపల్లిలో తెదేపా నాయకులు భానుప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ తల్లిపాల యొక్క ప్రాముఖ్యతను గర్భిణీలకు, చిన్నపిల్లల తల్లులకు వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్ లక్ష్మి, సహాయకురాలు జయలక్ష్మి,నాయకులు కృష్ణ రెడ్డి గణేష్,మునింద్ర, తదితరులు పాల్గొన్నారు.

రామకుప్పం: పురిటి బిడ్డతోనే తల్లిపాలు ఇవ్వడం శ్రేయస్కరమని డాక్టర్ పూజిత పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని విజలాపురం ప్రాథమిక ఆసుపత్రిలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సుకన్య,హెల్త్ అసిస్టెంట్ బాలు, అంగన్వాడీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గంగవరం: పలమనేరు పట్టణ సమీపంలోని రంగాపురం అంగన్వాడి కేంద్రంలో వర్కర్ చిలకమ్మ అధ్యక్షతన శుక్రవారం తల్లిపాలు వారోత్సవాలను ఘనముగా నిర్వహించారు. ఈ వారోత్సవాలకు ఐసిడిఎస్ సూపర్వైజర్ నజ్మా, జిఎంఎస్‌కె నాగమణి, ఏఎన్ఎం అనిలా ముఖ్య అతిథులకు హాజరైనారు. కార్యక్రమంలో అంగన్వాడి హెల్పర్ పరిమళ, ఆశ వర్కర్ లతా, గర్భవతులు బాలింతలు పాల్గొన్నారు.



చిత్తూరులో



పెద్దపంజాణిలో

IN THE COURT OF PRL. CIVIL JUDGE (JUNIOR DIVISION), PUTTUR
E.A. No.43/2024, E.P. No. 63/2018
O.S.No. 145/2017

BETWEEN:
N.Kavitha ...**Decree Holder**
AND:
K.Murali Krishna ...**Judgment debtor**

NOTICE TO THE JUDGMENT DEBTOR

K.Murali Krishna, S/o K.Doraswamy Setty, Residing at Chinna Nagar street, Karvetinagaram town and post, Karvetinagaram Mandal, Chittoor Dist.

Please take notice that, the Decree Holder filed the E.A.No.43/2024 against you for delivery of the E.P. schedule mentioned property in favour of her and the above petition is posted on 19/08/2024 for your appearance. Hence, on that day you may attend at 10-30 A.M. before above Hon'ble court either in person or through your advocate for any objection on it, failing which the matter will be decided as exparte against you.
This is the order of this Hon'ble court.

N.MURUGESHAN REDDY
ADVOCATE